## 10. బాధలలోంచి బయట పడటం ఎలా?

ఓ తాత్త్వికుడికి, ఓ గృహస్థ తనకున్న బరువు బాధ్యతలని ఏకరువుపెట్టి, మనశ్శాంతిని పొందే మార్గం చెప్పమని కోరాడు. తాత్త్వికుడు తను తాగబోయే నీళ్ళగ్లాసుని వెంటనే ఆ గృహస్థుకిచ్చి అడిగాడు.

"ఇది బరువుగా వుందా?"

"లేదు."

"అయితే చేతిని చాపి వుంచి నే చెప్పేదాకా దీన్ని పట్టుకుని వుండు."

అతనలా పట్టుకుని నిముషం గడిచింది. అయిదు... పది నిముషాలు గడిచాయి. చెయ్యి నొప్పి పుట్టడంతో ఆ సంగతి చెప్పాడు గృహస్థు.

"అర్థమైందా? నిముషం సేపు పట్టుకుంటే అది బరువు లేదు. అయిదు నిముషాలయ్యేసరికి పట్టుకున్న చేతికి నొప్పి పుట్టింది. అరగంట పట్టుకుంటే, గ్లాసు బరువుని భరించలేవు. రోజంతా పట్టుకుంటే ఇక చెయ్యే పని చేయదు. బరువులో తేడా లేకపోయినా, పట్టుకునే కాలం నిన్ను బాధిస్తుంది. ఇదే విధంగా, నువ్వు నీ బరువు బాధ్యతలని, కోప ద్వేషాలనీ నీ మనసుతో పట్టుకునే కాలం పెరిగే కొద్దీ, ఆ బరువు నీ మనసు మీదపడి అది భరించలేదు. ఈ బాధలోంచి బయట పడాలంటే నువ్వు చేయాల్సిందల్లా ఆ గ్లాసుని కింద పెట్టడమే."

"అర్థమైంది స్వామీ. మనిషి సంసారంలో వుండాలి కాని, సంసారం మనిషిలో ఉండకూడదన్న మాటకి అర్థం ఇప్పుడు నాకు బాగా బోధపడింది." చెప్పాడు గృహస్థు.

## 11. సర్వాంతర్యామి

ఓ కాలేజీలోని విద్యార్థులకి మంచి మాటలు చెప్పడానికి ఓ యోగిని ఆహ్వానించారు. ఆయన గురు ప్రార్థన చేసాక విద్యార్థులని అడిగాడు.

"మీలో ఎంతమంది ఈ కాలేజీని ఊడ్చే పనిమనిషిని ఒక్కసారైనా పలకరించారో వారు చేతులెత్తండి."

ఎవరూ చేతులని ఎత్తలేదు. కొందరది జోక్ అనుకుని నవ్వారు కూడా. అప్పుడా యోగి చెప్పాడు.

"ఇది మీరు నేర్చుకోవాల్సిన చాలా ముఖ్యమైన విషయం. మీ జీవితంలో మీరు మీకన్నా అధికులని ఎలా గౌరవిస్తారో అలాగే మీకన్నా తక్కువస్థాయిలో ఉన్నవారిని కూడా పలకరించి గౌరవించాలి. అంతర్యామి చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని జీవుల్లోనూ ఉంటాడు కనుక అందరూ గౌరవించ తగినవారే."

## 12. స్వయంకృషి ముఖ్యం

"స్వామీ! ఒకటి రెండు అనుమానాలు మీనించి తీర్చుకోడానికి వచ్చాను."

ఆ సాధకుడి వైపు అడగమన్నట్లుగా ప్రసన్నంగా చూసాడు స్వామి.

"నేను నా కుటుంబం కోసం ఖర్చు చేసే సమయాన్ని తగ్గించి, దాన్ని సాధన కోసం వినియోగిస్తున్నాను. ఉదాహరణకి ఇదివరకు స్కూటర్ మీద మా అబ్బాయిని స్కూల్లో దింపేవాణ్ని. ఇప్పుడు ఆటో రిక్షా మాట్లాడి పంపుతున్నాను. అది తప్పని కొందరు తోటి సాధకులంటారు. నా బాధ్యతని నేను సక్రమంగా నెరవేర్చకపోతే, వచ్చే జన్మలో మళ్ళీ నేను తండ్రిగా, వాడు కొడుకుగా పుట్టి వాడికి నేను సేవ చేయాల్సివస్తుందని అంటున్నారు."

"నువ్వు చేస్తున్నది సరైనదే. మీ అబ్బాయిని నువ్వు స్కూల్‌కి పంపడం ముఖ్యం తప్ప ఎలా అన్నది ముఖ్యం కాదు."

"కొందరంటారు, తాము గృహం, వృత్తి, ఇతర వ్యాపకాలని నిర్వర్తిస్తున్నామని, తాము చేయకుండానే, సాధన ఆ సమయంలో లోలోపల